కాలేదు సుమతికి. తన ఎదురుగానే, తన భర్త ఆవిడ చెయ్యి పుచ్చుకుని అలా అలా ఎక్కడికో, సినిమాలో లాగ ఖరిస్సీల్లో వెళ్ళిపోతున్నాడు... ఏడుపాగలేదు సుమతికి... ఈ కథలు రాయమనడం నా కొంపే ముంచింది కదా! ఇంతలో మెలుకువొచ్చేసింది... మాస్తే, పక్కన గాఢనిద్రలో ఉన్నాడు భర్త...

* * * *

"ఏవండీ!" పొద్దున్న నిద్ర లేస్తూనే పిలిచింది సుమతి.

"ఊ..."

"ఇవాళ సాయంత్రం తొందరగా వొస్తారా ఇంటికి?"

"ఎందుకూ?"

"ఇవాళ మన పెళ్ళిరోజా?"

అలాగా, కానీ తొందరగా రావడం కుదరదు సుమతీ... ఇవాళే నేనూ, శోభారాణీ చాలా సీరియస్‌గా డిస్కస్ చెయ్యదల్చుకున్నాం నేను రాయబోయే కథ గురించి."

తనకొచ్చిన కలగుర్తొచ్చి భయం వేసింది సుమతికి.

"మొన్నటికి మొన్నా... చిన్నదాని పుట్టినరోజునాడు త్వరగా ఇంటికి రమ్మంటే ఆ రోజూ ఇలాగే అన్నారు.. అంతకుముందూ ఓ రోజు గుడికి వెళ్దామంటే ఇలాగే అన్నారు... సినిమా కెళ్దామన్న రోజూ ఇలాగే అన్నారు..."

"ఏంచెయ్యమన్నావు చెప్పు... నీ ముచ్చట తీర్చడం కోసమే కదా నా ఈ పాట్లన్నీ... కథలు రాసే ప్రయత్నం నీకోసమే కదా?"

"కథలు రాసే ప్రయత్నంలోనే ఉన్నారో... కథ నడిపించే ప్రయత్నంలోనే ఉన్నారో ఆ దేవుడికి తెల్సు..."

"దేవుడిదాకా ఎందుకూ? శోభారాణికి తెల్సు నేనే ప్రయత్నంలో ఉన్నానో..."

ఒళ్ళు మండిపోయింది సుమతికి. కూర్చున్నది కాస్తా చటుక్కున లేచి నిలబడింది. "మాడండీ... మీరివాళ సాయంత్రం తొందరగా ఇంటికి వొచ్చి తీరాలి."

"మరి... మాటిచ్చానే శోభారాణికి..."

కళ్ళనీళ్ళొక్కటే తక్కువయ్యాయి సుమతికి.

"ఇదుగో... ఇప్పుడు చెప్తున్నాను వినండి... ఇవాళనించీ మీరు ఆఫీసునించి తిన్నగా ఇంటికొచ్చెయ్యాల్సిందే... శోభారాణి లేదు సుధారాణి లేదు..."

"అరే... మరి... అలా అంటే ఎలా?... నీ ముచ్చట తీర్చడం ఎలా? ఇన్నాళ్ళుగా ఆ శోభా రాణితో డిస్కస్ చేస్తూ ఉండడంవల్ల ఇప్పటికి కొంచెం దార్లో పడుతున్నాన్నేను... కథ రాయగలనన్న ధైర్యం వొస్తోంది..."

ఆవేశం పొంగుకొచ్చింది సుమతికి "మీరు కథలూ రాయక్కర్లేదు. కవితలూ రాయక్కర్లేదు..."

"నిజం? నిజంగానా?" ఒక్క ఉదుటున సంబరంగా లేచి భార్య భుజాలమీద చేతులు వేశాడు.

"నిజంగానా సుమతీ? నిజంగానే నేను కథలు రాయక్కర్లేదా? ఇంక మళ్ళీ ఎప్పుడూ రాయమని అడగవా?"

"ఎప్పుడూ అడగను..." నిక్కచ్చిగా చెప్పింది.

"మరి?... మరి... నీకు పట్టుచీరలు..." అనుమానంగా చూసాడు.

"పట్టుచీరలు నాకేం అక్కర్లేదు..."

"మరి... ఇంట్లో... నీక్కావల్సినవన్నీ కొనుక్కోడం?... టి.వి., ఫ్రిజ్..."

"నాకవేం అక్కర్లేదు... మీరు నాతో ఉంటే చాలు... మీరు ఉద్యోగంలో పైమెట్టుకి వెళ్ళి, మీ జీతం పెరిగి, జీతండబ్బుల్లో మిగుల్చుకుని ముందుముందు ఎప్పుడైనా కొనుక్కోగలిగితే కొనుక్కుంటాం... లేకపోతే లేదు... మీరునాతో ఉంటే అంతేచాలు నాకు..." భర్తగుండెలమీద వాలిపోయింది.

"బలవంతంగా మీ చేత కథలు రాయిద్దామనుకోడం నా తప్పే... అందుకు నన్ను క్షమించండి..."

హాయిగా గాలిపీల్చుకున్నాడు రాజారావు. "సత్యమూర్తికి థాంక్స్ చెప్పుకోవాలి..."

"ఎందుకూ?" ఆశ్చర్యపోయింది.

"ఈ శోభారాణి నాటకం ఆడించినందుకు... ఐడియా చెప్పినందుకు..."

"అంటే?... శోభారాణి?"

"మా ఆఫీసులో అసలు శోభారాణి లేదు... ఏరాణీ లేదు... నేను రోజూ సత్యమూర్తి ఇంట్లోనే పొద్దుపోయేదాకా గడుపుతూ ఉండేవాడిని. ఈ కథలు రాసే గండంనించి పూర్తిగా తప్పించుకుందుకు సత్యమూర్తి చెప్పిన ప్లానులో కల్పించిన పాత్ర ఆ శోబారాణి." తెల్లమొహం వేసింది సుమతి. "ఎంత నాటకం ఆడారు? రూపం అంటూ లేని ఆ శోభారాణి నాకలల్లోకి కూడా వొచ్చి ఏడిపించేసింది నన్ను... ఆ... అన్నట్టు నాకొక ఐడియా వొస్తోందండీ..." సుమతి బుర్రలో మెరుపులా మెరిసింది ఆలోచన.

"ఏవిటి?"

"మీచేత కథలు రాయించాలన్న నా ముచ్చట, మీరు పడినపాట్లు, ఈ శోభారాణి నాటకం మధ్యలో... ఇవన్నీ కలిపి చక్కగా అల్లేసి ఓ కథ రాసేయచ్చేమో మీరు!..."

"అయ్యబాబోయ్! మళ్ళీ కథమాట ఎత్తావంటే ఈ సారి ఏ ఉషారాణినో వెతుక్కోవల్సి వొస్తుంది..." మరి ఒక్క క్షణం అక్కడ నిలబడకుండా, పేస్టూ బ్రష్షూ పుచ్చుకుని బాత్‌రూమ్‌లోకి పరిగెత్తాడు రాజారావు.



## కాలమ్ దాటని కథ

వంటావిడ గంటమ్మగారి వంట అమృతమే గానీ... ఆవిడకి అలవాటుగా చెయ్యివాటం మాత్రం ఎక్కువగా వుందని గ్రహించింది మైత్రేయి. పప్పులు, ఉప్పులు... కూరలు నారలే కాక చెంచాలు... చిన్న చిన్న కంచాలు కూడా తెరచాటుగా గంటమ్మగారి ఇంటికి తరలి వెళ్ళి పోవడం గమనించి కుళ్ళి కుళ్ళి తనలో తానే కుమిలిపోయింది మైత్రేయి.

జాకెట్లో పెట్టుకుని తీసుకెడుతుందో... బొట్లో దోపుకుని దాటేస్తుందో... అర్థం కాలేదు మైత్రేయికి. బాగుండదని భర్తకి చెప్పుకోలేదు. అట్లా అని తన

# పోపు మాడిపోయింది!

మనసుకి వప్పచెప్పుకోలేకపోయింది. దీనికేదో విరుగుడు తనే కనిపెట్టాలని ఆలోచించి... తల తిరిగేలా ఆలోచించి... మంచం మీద ఒరిగి హాయిగా నిద్రపోయింది.

ఒక రోజు గంటమ్మగారు వంట చేసి మధ్యాహ్నాం ఇంటికెళ్ళిన తరువాత గంటకల్లా ఆమె ఇంటి ముందు ఆటోలో నీటుగా దిగింది మైత్రేయి. విస్తుపోయిన గంటమ్మగారు సుస్తీ వచ్చినదానిలా అయిపోయి... క్షణాల్లో తేరుకుని... "రండమ్మగారూ" అంటూ నిండుగా ఆహ్వానించింది.

"దీని దుంపు తెగ... పనిమనిషి తంపులమ్మ... నిలువునా మీ కొంప ముంచింది గంటమ్మగారూ! మా ఇంట్లోంచి తను దొంగిలించిన నాలుగు చెంచాలు... మూడు కంచాలు... రెండు గిన్నెలు... నాలుగు పాయసం దొన్నెలూ... వగైరాలన్నీ మీ ఇంట్లో దాచిపెట్టానని చెప్పింది. మావారు గబుక్కున పోలీసులకు ఫోన్ చేసేశారు. ఇంకో గంటలో అంటే మీరు మా ఇంటికి వంట చెయ్యడానికి వచ్చేలోపుగా... మిమ్మల్ని పోలీసులు తీసుకెళ్ళి... కాళ్ళు చేతులూ విరగగొట్టేసి... కీళ్ళు ఊడదీసి... కారం మీ ముఖానికి అలంకారంగా పూసి... ఇంకా ఏమేమో చెప్పరాని తప్పుడు పనులన్నీ చేస్తారట. అయినా మీకేం భయం? నేను మెచ్చిన మచ్చలేని వంట మనిషి మీరు... నిశ్చింతగా వుండండి వస్తాను" అంది మైత్రేయి.

గడగడ వణికిపోయిన గంటమ్మగారి ముఖం మాడిపోగా వెంటనే వంటింట్లోకి వెళ్ళి ఆ వస్తువుల్ని తెచ్చి ఇచ్చేసింది.

విజయగర్వంతో నవ్వుకున్న మైత్రేయి ఆత్రంగా వాటి నందుకొని ఆటోలో బయలుదేరింది.

ఆ తర్వాత గంటమ్మగారు మైత్రేయి ఇంటికి వచ్చి వంట చెయ్యలేదు పాపం.

—వడ్లమన్నాటి కుటుంబరావు